నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, సోమవారం 7 అక్టోబర్ 2024 | HYDERABAD

ఉప్పల్ భగాయత్‌లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. హెచ్‌ఎండీఏ , మున్సిపల్ శాఖలు పట్టించుకోకపోవడంతో ఆదివారం భగాయత్ వాసులు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వయంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం భగాయత్ పరిసరాల్లో వీధి దీపాలు లేవని, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం తాగి బాటిళ్లను రోడ్లపై వేస్తున్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. – రామంతాపూర్, అక్టోబర్ 6

రహదారి..గుంతలుగా మారి

ఇందిరాపార్కు రోడ్డు దుస్థితి ఇది..



జీడిమెట్లలో మెట్రో సాధన సమితి మహాధర్నాలో నిరసన వ్యక్తం చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

ఉద్యమిద్దాం.. మెట్రో సాధిద్దాం

మేడ్చల్‌కు వచ్చేదాకా పోరాటం ఆగదు

ఫోర్త్ సిటీ పేరిట ఇన్‌సైడ్ ట్రేడింగ్...

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్లలో మెట్రో సాధన సమితి ధర్నా

మద్దతు తెలిపిన ప్రజాప్రతినిధులు



సిటీబ్యూరో/కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): 'సాధిద్దాం... సాధిద్దాం.. మేడ్చల్ మెట్రో సాధిద్దాం... కావాలి... కావాలి.. మేడ్చల్‌కు మెట్రో కావాలి... వీ డిమాండ్... మేడ్చల్ మెట్రో... నార్త్ హైదరాబాద్‌కు మెట్రో కావాలి'... అంటూ.. ఉత్తర హైదరాబాద్ వాసులంతా ఒక్కటై నినదించారు. మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో ఉత్తర హైదరాబాద్ ప్రాంత వాసులంతా ఒక్కటై ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కొన్ని నెలలుగా మెట్రో కోసం డిమాండ్ చేస్తున్నా..రేవంత్ సర్కారు పట్టించుకోకపోవడంతో రోడ్డెక్కి ధర్నాకు దిగారు. మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆందోళనలకు వేలాది మంది మద్దతు పలికారు. ప్రజాప్రతినిధులు సైతం వారికి అండగా నిలిచి.. మేడ్చల్ మెట్రో సాధనకు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆదివారం జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం వద్ద మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ నగరానికి నలుదిక్కులా మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్లు అండర్ పాస్‌ల నిర్మాణాలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నగరానికి ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రో విస్తరణపై సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులను అప్పగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దిరోజులకే పక్కన పెట్టిందన్నారు. ఫోర్త్‌సిటీ పేరుతో రూ.8 వేల కోట్లను ప్రతిపాదించి.. సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. చెరువుల పరిరక్షణ పేరుతో ఏర్పాటు చేసిన హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చుతూ..ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నిర్ణయాల వెనుక సీఎం రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, అవగాహన లేమి ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. ఇక్కడి ప్రాంతానికి న్యాయబద్ధంగా రావాల్సిన మెట్రోను సాధించేంత వరకు ఉద్యమాలు ఆపేదిలేదని హెచ్చరించారు.

'హైదరాబాద్ ఉత్తర భాగమైన మేడ్చల్, కొంపల్లి, అల్వాల్, శామీర్‌పేట, కీసర ప్రాంతాలు అన్ని రంగాల్లో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఔటర్ రింగురోడ్డు లోపల, బయట ప్రాంతాల్లోనూ నివాసాలే కాకుండా వ్యాపార, వాణిజ్య కేంద్రాలున్నాయి. దీంతో నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తున్న ఈ ప్రాంతాలకు మెట్రో మార్గాలను నిర్మించాల్సిన అవసరం ఉంది'. అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ధర్నాలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అండగా ఉంటుంది..

మేడ్చల్ ప్రాంతం వరకు మెట్రో రావాలని గత కొన్ని నెలలుగా ఇక్కడి నివాసితులు పోరాటం చేస్తున్నారు. తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ వారందరికీ అండగా ఉంటుంది. రేవంత్ సర్కారు మంచి చేసేందుకు సమయం ఇచ్చాం. కానీ అన్ని తప్పుడు నిర్ణయాలే తీసుకుంటున్నది. అందుకు నిదర్శనమే... మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రో మార్గాలను విస్తరించకపోవడం. గత కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాంతాలకు మెట్రో మార్గాలను ప్రతిపాదించినా.. దాన్ని రేవంత్ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది. మేడ్చల్ మెట్రో సాధనకు పోరాటం ఉధృతం చేస్తాం. తప్పకుండా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తాం. అసెంబ్లీలో సైతం ఈ అంశాన్ని లేవనెత్తాం.దీనికి సరైన సమాధానం సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వలేదు. అన్ని వేదికలపై మేడ్చల్ మెట్రో అంశాన్ని ప్రస్తావిస్తాం. మేడ్చల్ మెట్రో మార్గం వచ్చే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ప్రభుత్వం కండ్లు తెరిచే వరకు ఈ పోరాటం ఉంటుంది. మేడ్చల్ మెట్రో సాధన సమితి 8 నెలలుగా నిర్విరామంగా పోరాడుతున్నది. అయినా రేవంత్ సర్కారు పట్టించుకోకుండా రెండో దశ మెట్రో ప్రతిపాదిత మార్గాలను ప్రకటించింది. అందులో ఎక్కడా మేడ్చల్, శామీర్‌పేట వైపు మెట్రో మార్గాలను నిర్మిస్తామని చెప్పలేదు.

– కేపీ వివేకానంద్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే

నా క్లాస్‌మెట్.. బదిలీ ఆపండి..!

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై కాంగ్రెస్ నేత ఒత్తిడి

బదిలీ చేసినా.. కుర్చీ వదలనంటున్న ఏసీపీ

పైరవీలతో అధికార పార్టీ నేతల పెత్తనం

చర్చనీయాంశమైన సికింద్రాబాద్ జోనల్ ఏసీపీ వ్యవహారం

సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల అంతర్గత బదిలీల్లోనూ అధికార పార్టీ నేతల జోక్యం మితిమీరుతున్నది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జూబ్లీ హిల్స్ సర్కిల్ డీసీ (డిప్యూటీ కమిషనర్) బదిలీ అయిన చోటుకు వెళ్లకుండా ప్రభుత్వ స్థాయిలో తన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను రద్దు చేయించుకొని..తిరిగి అదే పోస్టులో కొనసాగేలా మరో ఉత్తర్వు తెప్పించుకున్నారు. ఈ వ్యవహారంలో సదరు డీసీకి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నీ తానై అండగా నిలిచినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఈ అంశం మరువక ముందే తాజాగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి సికింద్రాబాద్ జోన్‌లో పనిచేస్తున్న ఓ ఏసీపీ బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేది లేదంటూ ట్రాన్స్‌ఫర్ ఆదేశాలను ధిక్కరిస్తున్నారు. పలువురు ఏసీపీలకు స్థానచలనం కల్పించగా.. సికింద్రాబాద్ జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు బదిలీ అయిన సదరు ఏసీపీ ..ట్రాన్స్‌ఫర్ అయిన చోటుకు వెళ్లేది లేదంటూ పైరవీ బాట పట్టారు. తన క్లాస్‌మెట్ అని చెప్పుకొంటున్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన కాంగ్రెస్ లీడర్, మాజీ ఎమ్మెల్యేతో కమిషనర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఉద్యోగ విరమణకు కొన్ని నెలలు మాత్రమే ఉందని, సికింద్రాబాద్‌లోనే కొనసాగించాలని ఆ మాజీ ఎమ్మెల్యే ఏసీపీ తరపున పైరవీ ప్రారంభించారు. అయితే వారం రోజులు గడిచినా.. సదరు ఏసీపీ బదిలీ అయిన చోటుకు వెళ్లకుండా మళ్లీ ఎలాగైనా ఉన్న స్థానంలో కొనసాగేలా యత్నిస్తున్నారు. కమిషనర్ మాత్రం ఒక్కసారి బదిలీ అయ్యాక వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో సదరు ఏసీపీ చార్మినార్ జోనల్‌లో పోస్టింగ్ తీసుకుంటారా? లేదా? అన్నది తోటి ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

రేపు బల్దియాలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కార్మికుల కోసం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్, సైన్‌షైన్ హాస్పిటల్ సహకారంతో డాక్టర్ విమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సర్కిల్, జోనల్ అధికారులతో పాటు ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, సిబ్బంది కార్మికులతో సహా అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రధాన కార్యాలయానికి వచ్చి ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండక్కి.. సొంతూర్లకు

దసరా సమీపిస్తుండటంతో నగరవాసులు సొంతూర్ల బాటపడుతున్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో ప్రతి రోజూ భారీగా రద్దీ ఉంటున్నది. ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసిన ఉప్పల్ చౌరస్తా

ఆశలన్నీ ఓటీఎస్ పైనే..!

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జలమండలి

ప్రతి నెలా రూ.119 కోట్ల లోటుతో అవస్థలు

రూ.1961 కోట్ల మేర బకాయిలు రాబట్టుకునే ఎత్తుగడ

రూ.1660 కోట్ల బకాయిలున్న ప్రభుత్వ రంగ సంస్థలపై నజర్

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు లేఖలు

సిటీబ్యూరో: బల్దియా బాటలోనే జలమండలి నడుస్తున్నది. నెలవారీగా నీటి బిల్లులు, నల్లా కనెక్షన్లు, వాటర్ ట్యాంకర్ల రూపంలో రూ. 115 కోట్ల మేర వస్తుండగా... ఖర్చులు మాత్రం రెట్టింపు స్థాయిలో రూ. 234 కోట్ల మేర ఉంటున్నది. అంటే ..ప్రతి నెలా రూ .119 కోట్ల లోటుతో జలమండలి కొట్టుమిట్టాడుతున్నది. ముఖ్యంగా విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన కరెంట్ చార్జీలు రూ.3800 కోట్లు పెద్ద సవాల్‌గా మారింది. గడిచిన 10 నెలలుగా ప్రభుత్వం నుంచి ఒక్క పైసా విడుదల కాలేదు...20 కేఎల్ ఉచిత వాటర్‌కు ప్రభుత్వం నుంచి రూ.715 కోట్ల మేర రావాల్సి ఉంది. కాగా, జలమండలి సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలు ఉన్నా..లోపాలను సరిదిద్దే సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. నల్లా కనెక్షన్ల (క్యాన్) సర్వే, గేటెడ్ కమ్యూనిటీ, ఇతర వ్యాపార సంస్థల నుంచి సీవరేజీ సెస్, డెవలప్‌మెంట్ చార్జీల సవరణ, ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల్లో కొత్త నల్లా కనెక్షన్ల జారీ వంటి సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. అధికారులు మాత్రం ఇవేం పట్టకుండా నీటి చార్జీలు పెంచకపోవడం వల్లే భారం పెరుగుతున్నదని చెబుతుండటం గమనార్హం. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రూ.1660 కోట్లు, ప్రైవేట్, డొమెస్టిక్ వినియోగదారుల నుంచి సుమారు రూ. 300కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. దీంతో తెరపైకి ఓటీఎస్‌ను మళ్లీ తీసుకువచ్చి ఈ నెలాఖరు వరకు అమలు చేస్తున్నారు.

వన్ టైం సెటిల్‌మెంట్..

నీటి బిల్లు బకాయిదారులకు ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు చేసింది. 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తించనున్నది. వీటి నుంచి రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉండగా, ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానుంది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రభుత్వ శాఖలకు లేఖలు..

సుమారు 40 ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 1660 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. వైద్య ఆరోగ్య రూ. 56.30 కోట్లు, హౌసింగ్ రూ.33 కోట్లు, ఇరిగేషన్ రూ. 21 కోట్లు , పంచాయతీ రాజ్ రూ. 37కోట్లు, మిషన్ భగీరథ రూ. 82 కోట్లు, పురపాలక రూ. 26 కోట్లు, సాధారణ పరిపాలన రూ. 12 కోట్లు, హోం రూ. 27 కోట్లు తదితర శాఖలు నీటి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలకు జలమండలి లేఖలు రాయనున్నది.